క్లుప్తంగా

40 మంది పేదలకు ఆహార ప్యాకెట్లు



సత్తెనపల్లి: పట్టణ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో ఇటీవల అకాల మరణం చెందిన ఆర్యవైశ్య యువజన సంఘం మాజీ అధ్యక్షుడు అన్నం వెంకటరామారావు జ్ఞాపకార్థం ఆర్యవైశ్య సేవా సమితి అధ్యక్షుడు వెలుగురి శరత్‌బాబు ఆర్థిక సహాయంతో 40 మంది నిరుపేదలకు శనివారం ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి కోశాధికారి మద్ది వెంకటేశ్వర్లు, నాయకులు సీహెచ్ నాగేశ్వరరావు, గుంటూరు సుబ్బారావు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు దివ్వెల శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు చందోలు వెంకట మల్లికార్జునరావు, షేక్ బుడే పాల్గొన్నారు.

వృద్ధులకు అన్న సంతర్పణ



సత్తెనపల్లి: రైతు సంఘం నాయకుడు, నరసరావుపేట మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన మత్రం తిరుపతిస్వామి 19వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని మాతృ శ్రీ మొల్ల మాంబ వృద్ధాశ్రమంలో వృద్ధులకు మత్రం సాంబశివరావు ఆర్థిక సాయంతో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అన్న సంతర్పణ శనివారం నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ మాట్లాడుతూ వృద్ధులకు, పేదలకు అన్న సంతర్పణ చేయటం ఎంతో పుణ్యమన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి తోట రామతిరుపతిరావు. ఎం.గోపీ, ఆశ్రమ నిర్వాహకులు ఆరేపల్లి ఏడుకొండలు తదితరులు ఉన్నారు.

రుద్రవరంలో ఫ్యామిలీ డాక్టర్



రుద్రవరం(ముప్పాళ్ళ): మండలంలోని రుద్రవరం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం శనివారం జరిగింది. పీహెచ్‌సీ వైద్యులు పి.రమాదేవి, ఎస్.సూర్యప్రకాశరావు 94 మందికి వైద్య సేవలందించారు. అవసరమైన వారికి రక్త, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి మంచానికే పరిమితమైన వారి ఇళ్లకు వెళ్లి వైద్యసేవలు అందించారు. పాఠశాల విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ దివ్యకీర్తి, సూపర్ వైజర్లు పీటర్ డానియేన్, జోస్పిన్ రాణి, ఏఎన్ఎం పద్మ, డీఈఓ రవితేజ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటిలో మంచి వాతావరణం కల్పించాలి



అచ్చంపేట: పదవతరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు కావలసిన వసతులను తల్లిదండ్రులు కల్పించాలని అప్పుడే వారు మంచి మార్కులతో ఉత్తీర్ణులవుతారని హెచ్ఎం వి.లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలులో శనివారం జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా పరీక్షలు అయిపోయేంతవరకు ఇంటిలో టీవీలు బంద్ చేయాలని, సెల్‌ఫోన్లు అందుబాటులో ఉంచొద్దని చెప్పారు. విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేందుకు చేయాల్సిన ప్రయత్నాలన్నీ తాము చేశామని, ఇక తల్లిదండ్రులు శ్రద్ధ చూపడమే మిగిలి ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం

అమరావతి: మండల పరిధిలో ఓ బాలికపై అత్యాచారం జరిగిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. స్థానిక ఎస్సీ కాలనీలో శుక్రవారం రాత్రి ఇంటి సమీపంలోని మైనర్ బాలికపై బుల్లా హజరత్ మస్తాన్ అనే వ్యక్తి కన్నేశాడు. రాత్రి 8.30 గంటల సమయంలో తల్లిదండ్రులు ఇంటిలో లేకపోవడాన్ని గమనించి బాలికకు మాయ మాటలు చెప్పి తన ఇంటిలోకి తీసుకెళ్లాడు. ఆ సమయంలో బాలిక.. నిందితుడు బుల్లా హజరత్‌మస్తాన్ ఇంటి నుంచి బయటకు రావటాన్ని తల్లిదండ్రులు గమనించారు. ఏం జరిగిందో అసలు విషయం అడిగి తెలుసుకుని.. శనివారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ, పెదకూరపాడు సీఐ వీరాస్వామి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని అత్యాచారం, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. రిమాండు నిమిత్తం సత్తెనపల్లి కోర్టులో హాజరుపరిచారు.

ఉపాధి కూలీల సంఖ్య మరింత పెంచాలి

డ్వామా పీడీ జోసఫ్‌కుమార్



సామాజిక తనిఖీలో మాట్లాడుతున్న డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

క్రోసూరు: మండలంలో ఉపాధి కూలీల సంఖ్య మరింత పెంచాలని, ప్రతి రోజు 3 వేల మంది పనిచేసేలా లక్ష్యంగా పెట్టుకోవాలని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లను డ్వామా పీడీ జోసఫ్ కుమార్ ఆదేశించారు. క్రోసూరు ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండలంలో 2021–22లో జరిగి ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ చేపట్టారు. కార్యక్రమానికి ఎంపీపీ పి.కోటయ్య అధ్యక్షత వహించారు. జెడ్పీటీసీ షేక్ జమీలా, సర్పంచ్ మల్లా చందమామ, ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.శివరామయ్య పాల్గొన్నారు. 489 ఉపాధి హామీ పనులకు ఖర్చు చేసిన రూ.4.97 కోట్లు, అదేవిధంగా పంచాయతీ రాజ్ శాఖ ద్వారా 58 పనులకు ఖర్చుచేసిన రూ. 3.80 కోట్లు, స్కూల్ ఎడ్యుకేషన్ ద్వారా 3 పనులకు చేసిన ఖర్చు రూ.10 లక్షలపై సామాజిక తనిఖీ జరిగింది. ఎస్ఆర్పీ పున్నపనాయుడు, డీఆర్పీలు మండలంలోని ఆయా పంచాయతీల నివేదికలు చదివారు. ఖర్చు, జాబ్‌కార్డు, రోజ్‌గార్ దివస్ నివేదికలు, మస్టర్ వెరిఫికేషన్, ఈసీ చెక్, రికార్డుల నిర్వహణ, గ్రామ సభలు తదితర వివరాలు సక్రమంగా చూపించలేదని పీడీ ఈ సందర్భంగా తెలిపారు. వాటన్నింటినీ వచ్చేసారి తప్పనిసరిగా సక్రమంగా నివేదికల్లో చూపించాలని.. లేకుంటే పెనాల్టీలు చెల్లించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. అదేవిధంగా గ్రామసభలకు తప్పనిసరిగా ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. తద్వారా అందరికీ పనులపై అవగాహన, ఎక్కువ మంది కూలీలకు అవకాశాలు కల్పించటం జరుగుతుందన్నారు. ఏపీడీ కె.రఘుకుమార్, డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పెన్షన్ల డీపీఎం ఉషశ్రీ, ఏపీఓ వెంకటనారాయణ, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సంఘం ఎన్నిక



సంఘానికి మొదటి విరాళాన్ని అందజేస్తున్న కోట వెంకటేశ్వర్లు

అచ్చంపేట: పాఠశాలను అభివృద్ధిచేసి, విద్యాభివృద్ధికి తోడ్పడాలన్న సంకల్పంతోనే పూర్వ విద్యార్థుల సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఉప్పల శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. స్థానిక తుమ్మేపల్లి శ్రీరాములు జిల్లా పరిషత్ హైస్కూలులో శనివారం జరిగిన మొదటి పూర్వ విద్యార్థుల సంఘ సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. 70ఏళ్ల క్రితం దాత తుమ్మేపల్లి శ్రీరాములు ఆరు ఎకరాల విస్తీర్ణంలో 12 గదుల పక్కా భవనాన్ని నిర్మించి జిల్లా పరిషత్‌కు అప్పగించినట్లు గుర్తుచేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పాఠశాలలో 14 వేల మందికిపైగా విద్యార్థులు విద్యనభ్యశించారని, దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారని చెప్పారు. ఇటీవల పూర్వ విద్యార్థులు రూ.25లక్షలు సేకరించి, శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాన్ని అధునీకరించినట్లు చెప్పారు. సంఘానికి మొదటి విరాళంగా పూర్వవిద్యార్థి, ప్రస్తుతం ఏపీ సెక్రటేరియట్‌లో పనిచేస్తున్న కోట వెంకటేశ్వర్లు రూ.20వేల అందజేశారు.

ఏకగ్రీవంగా కార్యవర్గం ఎన్నిక

టీఎస్సార్ జెడ్పీహెచ్ స్కూల్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉప్పల శ్రీనివాసమూర్తి, ఉపాధ్యక్షుడిగా సూరే సంపత్, కార్యదర్శిగా పసుపులేటి పాపిరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా గనుపల్లి సతీష్‌బాబు, కోశాధికారిగా కొప్పురావూరి కోటేశ్వరరావు, ఉప కోశాధికారిగా వి.కిషోర్, కార్యవర్గ సభ్యులుగా సురే వెంకట కోటిలింగం, శిఖా ప్రకాశం, చలువాది అప్పారావు, ఎం.ప్రభాకర్ ను ఎన్నుకున్నారు. వారితో హెచ్ఎం వి.లక్ష్మీనారాయణ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు అనిల్, గుంజిరవి, ఏలూరి పిచ్చయ్య, సూరే సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న దివ్వెల శ్రీనివాసరావు

సత్తెనపల్లి: ర్యాగింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు ర్యాగింగ్ నిరోధక చట్టం ఏర్పాటు చేయడం జరిగిందని సత్తెనపల్లి ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ డి.నాగ వెంకటలక్ష్మి సూచనల మేరకు నందిగామ గ్రామంలోని షిర్డీ సాయిబాబా కల్యాణ మండపంలో మహిళల కోసం ప్రత్యేక న్యాయవిజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. ముందుగా సభా పరిచయం పారా లీగల్ వలంటీర్ షేక్ సుబాని చేశారు. ముఖ్య అతిథిగా న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థినులు వేధింపులకు గురి అయితే ఈవ్‌టీజింగ్ చట్టం కింద ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, భరణం, లైంగిక వేధింపులు నుంచి రక్షణ పొందే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఎంపీటీసీ సయ్యద్ షిమా, నందిగామ మహిళా పోలీస్ భాగ్యలక్ష్మి, గుడిపూడి మహిళా పోలీస్ కేజియా రాణి, పారా లీగల్ వలంటీర్లు షేక్ సుబాని, షేక్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

కంటెపూడిలో సినిమా షూటింగ్



ఓ సన్నివేశం

సత్తెనపల్లి: శ్రీ గణేష్ దేవి మూవీ క్రియేషన్స్ బ్యానర్ పై రాయదుర్గం రమాదేవిరెడ్డి నిర్మాతగా వ్యవహరిస్తూ నిర్మిస్తున్న 'కాశీనగర్ 1947' సినిమా షూటింగ్ శనివారం సత్తెనపల్లి మండలం కంటెపూడి సమీపంలోని ముప్పాళ్ళ సారంగధరరావు గెస్ట్ హౌస్ లో ముప్పాళ్ళ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. పట్టణానికి చెందిన వల్లెం లక్ష్మీ చెన్నకేశవ నాయుడు ప్రతి నాయకుడి పాత్రలో జగన్నాథ పట్నాయక్ గా, సీనియర్ న్యాయవాది మర్రి వెంకట సుబ్బారెడ్డి ఎస్పీగా, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గా షేక్ సైదా, ప్రతి నాయకుడికి రైట్ హ్యాండ్ గా తిరుపతి, జానీ లపై సన్నివేశాలను చిత్రీకరించినట్లు దర్శక నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి కథ, మాటలు, స్క్రీన్ ప్లే, దర్శకత్వం చిత్త జల్లు ప్రసాద్, కెమెరామెన్ జి.కృష్ణ నాయుడు, దేవకి మురళీకృష్ణ, సంగీతం లక్ష్మణ సాయి, పాటలు జి.సీతారామ చౌదరి అందించారు.

దృఢమైన మనస్తత్వమే విజయానికి సోపానం

జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట రూరల్: సానుకూల దృక్పథం, దృఢమైన మనస్తత్వం కలిగి ఉండటమే విజయానికి సోపానం అని జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. పెట్లూరివారిపాలెంలోని ఏఎంరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన బీటెక్ నాల్గవ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు సభకు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విజయాన్ని సాధించే వరకు వెనుకడుగు వేయకుండా శ్రమించాలని విద్యార్థులకు సూచించారు. మానవ జీవితంలో విద్యార్థి దశ అత్యంత విలువైనదన్నారు. ఈ దశలో తీసుకున్న నిర్ణయాలు చదువు పట్ల చూపిన శ్రద్ధే విజయానికి కారణమవుతుందని తెలిపారు. విద్యార్థి జీవితంలో సఫలం అయ్యాడా, విఫలం అయ్యాడా అనేది చదువులో చూపిన ప్రతిభ ఆధారంగా నిర్ణయించబడుతుందన్నారు. మానసిక దృఢత్వం, సానుకూల దృక్పథం, నిరంతం కృషి విద్యార్థి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు దోహదపడుతుందని వివరించారు. విద్యార్థులు మానసిక స్థిరత్వం కలిగి ఉండి జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించాలని సూచించారు. జల్సాలకు, చెడు అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. లోన్ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, లోన్ యాప్‌ల బారిన పడి చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని గుర్తుచేశారు.

కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి, డీఎస్పీ విజయభాస్కర్, రూరల్ సీఐ భక్తవత్సల రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి, డీన్ డాక్టర్ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహంకాళి అమ్మవారి తిరునాళ్ల



యాగశాలలో పూర్ణాహుతి

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలో వేంచేసి యున్న మహంకాళి అమ్మవారి దేవస్థానం 48వ తిరునాళ్ల మహోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు. అమ్మవారికి విశేష పూజలు, ప్రత్యేక అలంకరణలు జరిపారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు సమర్పించారు. మహిళలు పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం అమ్మవారికి స్నపనం, గవ్యాంతము తదితర పూజలు జరిపారు. అనంతరం ప్రధాన కలశ ఆలయ ప్రవేశాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని జరిపారు. పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్ పూర్ణాహుతిలో పాల్గొన్నా రు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ గావించారు. అమ్మవారిని దర్శించుకునే భక్తులకు మజ్జిగ, రాగిజావ, పులిహోర ప్రసాదాలను పలు సంస్థలు అందజేశాయి. ఆలయ ఈవో టి.సుధాకరరెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆదిశైవ సంఘం అధ్యక్షులు యన మంద్ర సత్యసీతారామశర్మ, ఆలయ అర్చక స్వాములు కొత్తలంక కార్తీకేయశర్మ, నందూరి కాశీకృష్ణ ఆధ్వర్యంలో పూజాధికాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేసారు.

జొన్నలగడ్డ శ్రీరామమూర్తిచే భక్తిగీతాలు, శ్రీ సాయి అన్నమయ్య భాస్కర సంగీత కళాక్షేత్రం గాయనీ బి.చంద్రకళ కీర్తనలు భక్తులను అలరించాయి.

ఏఎంసీ చైర్మన్‌కు సత్కారం

అమరావతి: క్రోసూరు ఏఎంసీ చైర్మన్, వైఎస్ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన ఈదా సాంబిరెడ్డి, గార్లపాటి దాసును శనివారం మల్లాది గ్రామస్తులు సత్కరించారు. మాజీ ఎంపీపీ వెంపా జ్వాలా లక్ష్మీనరసింహరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు శాలువా కప్పి సత్కరించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వాసు, సాంబశివరావు, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రసన్నాంజనేయుని జయంత్యుత్సవాలు



రాజుపాలెం: మండలంలోని ఆకుల గణపవరంలో ప్రసన్నాంజనేయస్వామి 94వ జయంతి మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారికి సామూహిక లక్ష తమలపాకుల, సింధూర పూజలు దంపతులు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు శ్రీనివాసుల హనుమంత్ దీక్షితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని కనులారా తిలకించారు. భక్తులు మొక్కులు తీర్చుకొని, స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. రథంపై స్వామివారిని గ్రామ పురవీధుల్లో మేళ తాళాలతో ఊరేగించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

అహోరాత్ర మహా మృత్యుంజయ యాగం

వినుకొండ (నూజెండ్ల): పెరిగిపోతున్న అనారోగ్య సమస్యల పరిష్కారానికి వినుకొండ శాంతి ఆశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో సర్వలోక కల్యాణం చేసేందుకు వినుకొండ రూరల్ విఠంరాజుపల్లి గ్రామ శివారులోని సాయి బృందావనం నందు చేపట్టిన 72 గంటలపాటు అహోరాత్ర మహా మృత్యుంజయ యాగం హిమాలయ గురూజీచే శనివారం ప్రారంభించారు. ఈ నెల 14న మహా పూర్ణాహుతితో కార్యక్రమం ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకటరామిరెడ్డి,పెండేల పుల్లారావు, మోహన్‌రావు, సుధాకర్, ప్రవీణ్, ఎల్ఐసి వాసు, ఏరువా నాగముని కొండారెడ్డి, శ్రీనివాసరెడ్డి, కందుల లక్ష్మీరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ఎంఈవో తనిఖీ

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామంలో ఎస్సీ కాలనీ ఎంపీపీ స్కూలు ఎంఈవో మద్దికుంట సాంబశివరావు శనివారం సందర్శించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి ఉపాధ్యాయులు తమవంతు కృషి చేయాలన్నారు. ఆయనతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు, దేశబోయిన రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనజీవామృతంతో భూసారం పెంపు..

ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి



మాదలలోని గోశాలను సందర్శించిన అమలకుమారి

మాదల(ముప్పాళ్ళ): రైతులు వేసవిలో పొలాలు ఖాళీగా ఉంచకుండా.. పీఎండీఎస్ విధానం ద్వారా ఘన జీవామృతాన్ని పొలాల్లో చల్లుకున్నట్లయితే వర్షాలు పడినప్పుడు అన్ని విత్తనాలు మొలిచి, భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి చెప్పారు. మండలంలోని మాదల గ్రామంలో మాజీ ఎంపీపీ గోగినేని కోటేశ్వరరావుకు చెందిన గోశాలను శనివారం ఆమె సందర్శించారు. అక్కడ తయారు చేస్తున్న ఘన జీవామృతం విధానాన్ని పరిశీలించారు. 300 ఆవులతో గోశాల నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఆవు మూత్రం, పేడ ఉపయోగించి శనగ పిండి, బెల్లం , పుట్ట మన్ను వేసి ఘనజీవామృతం తయారీని పరిశీలించారు. పీఎండీఎస్ అంటే 30 రకాల నవధాన్య విత్తనాలు, పప్పు ధాన్యాలు, నూనె గింజలు, కూరగాయలు, ఆకు కూరలు మొదలైనవి విత్తన గుళికలుగా తయారు చేస్తారని వివరించారు. విత్తనాలను పొలాల్లో చల్లుకోవటం ద్వారా వర్షాలకు మొలిచి సూక్ష్మజీవులు అభివృద్ధి చెందడం ద్వారా భూసారం పెరుగుతుందని తెలిపారు. ఈ విత్తనాలతో పాటుగా ఘనజీవామృతం వేసుకోవడం ద్వారా భూసారం పెరిగి మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయన్నారు. కేజీ రూ.10 చొప్పున తక్కువ ధరలో అందుబాటులో ఉందని, రైతులు ఉపయోగించుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రజని, ఉమా, పూజ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ తిరుపతమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

బయ్యవరంలో తిరునాళ్లకు హాజరైన ఎమ్మెల్యే నంబూరు



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

బయ్యవరం(క్రోసూరు): బయ్యవరం గ్రామంలోని లక్ష్మీ తిరుపతమ్మ తల్లి, గోపయ్య స్వామి వార్ల తిరునాళ్ల మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. భక్తులు అశేషంగా పాల్గొని, అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. తిరునాళ్ల సందర్భంగా నాలుగు పెద్ద ప్రభలు, నాలుగు చిన్నప్రభలు భక్తులు ఏర్పాటు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కొతారువారి ప్రభ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే నంబూరు శంకరరావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు, రైతులు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, పాడి పంటలతో విరజిల్లాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు కొతారు వెంకట్రావు, పూజల వెంకట్రావు, కడియం రామారావు, శిరసాని కాశీ విశ్వేశ్వరరావు, బుర్రి వెంకట్రావు, కొంచాల నాగేమల్లేరావులతో పాటు ఎంపీపీ పి.కోటయ్య, ఏఎంసీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, హుస్సేన్ నగరం సర్పంచ్ మాగులూరి అనిల్, క్రోసూరు వైఎస్సార్ సీపీ కన్వీనర్ వెలది అప్పారావు, కంబంపాటి రాము, గల్లా గురుపాదం , కాపు కార్పొరేషన్ డైరెక్టర్ జూనియర్ వెంకట్రావు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

మహిళా హక్కులు, చట్టాలపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న ఏజీపీ బాలి సైదా

ముప్పాళ్ళ: రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సత్తెనపల్లి న్యాయసేవాధికారి సంస్థ చైర్మన్, సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి డి.నాగవెంకటలక్ష్మి సూచనల మేరకు న్యాయ అవగాహన సదస్సు శనివారం ముప్పాళ్ళలో జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ బాలిసైదా పాల్గొని, గృహహింస చట్టం, మనోవర్తి, గర్భలింగ నిర్ధారణ చట్టంపై అవగాహన కల్పించారు. ప్యానల్ న్యాయవాది బి.ఎల్.కోటేశ్వరరావు మహిళా హక్కులను, చట్టాలను వివరించారు. ఏఎస్సై ఎస్.కె.ఇమామ్ ఈవ్‌టీజింగ్, బాల నేరాలు గురించి వివరించారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మాధవరావు, రఫీ, పారాలీగల్ వలంటీర్ ఖాజావలి, షేక్‌సుభాని తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు ఐరన్ ద్రావణం



టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న వైద్యఆరోగ్యశాఖ అధికారి జి.శోభారాణి

నకరికల్లు: చిన్నారులకు సకాలంలో వ్యాధినిరోధక టీకాలు వేయించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జి.శోభారాణి సూచించారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న వ్యాధినిరోధకటీకా కార్యక్రమాన్ని శనివారం ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు. అందుబాటులో ఉన్న టీకాలు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేకంగా కేటాయించిన రోజుల్లో విధిగా వ్యాక్సిన్‌లు వేయాలన్నారు. గర్భిణులకు, చిన్నారులకు వేయాల్సిన వ్యాక్సిన్‌లపై అవగాహన కల్పించారు. చిన్న పిల్లల్లో రక్తహీనత రాకుండా ఐరన్ ద్రావణాన్ని ప్రతి సోమ, గురువారాల్లో ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి పి.గీతాంజలి, డాక్టర్ వి.శ్రీనునాయక్, సీహెచ్ఓ కె.మల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

నకరికల్లు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. కొత్త లక్ష్మీనారాయణ, లక్ష్మీకాంతమ్మల /ాపకార్థం శంకర్ కంటి ఆసుపత్రి సహకారంతో కంటి పరీక్షలు చేసి, శుక్లం ఉన్నవారిని గుర్తిస్తారన్నారు. శుక్లం ఉన్నవారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తారని తెలిపారు. ఆరోగ్యశ్రీ, ఆధార్ కార్డులతో రోగులు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 9866142079 నంబరుకు సంప్రదించాలన్నారు.

ఏబీఎం ఆస్తి మిస్సమ్మ బంగ్లాపై వివాదం



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని నరసరావుపేట రోడ్డులోని ఏబీఎం ఆస్తి మిస్సమ్మ బంగ్లా స్థలం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఆ స్థలం తమదేనంటూ కొంతమంది వ్యక్తులు అక్కడికి చేరుకోవడంతో పాటు తమ వద్ద దస్తావేజులు ఉన్నాయంటూ బయట పెట్టారు. ఈ విషయం తెలుసుకున్న వినుకొండకు చెందిన ఎస్సీ నాయకులు కొంతమంది స్థలం వద్దకు చేరుకున్నారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగకుండా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని అక్కడి నుంచి ఇరు వర్గాలను పంపించి వేశారు. ఇలా తమదంటే తమదంటూ ఏబీఎం ఆస్తులపై ఒకరి తరువాత ఒకరు వస్తుండటంతో అధికారులు కూడా తలలు పట్టుకుంటున్నారు. అయితే ఇప్పుడు ఇలా మరికొంతమంది స్థలం తమదేనంటూ రావడం చర్చనీయాంశంగా మారింది.

'చిక్కి'పోలేదు కదా?!

నాదెండ్ల: మండలంలోని ఎండుగుంపాలెం ఎస్సీ కాలనీలో ఐసీడీఎస్ అధికారులు శనివారం పర్యటించారు. ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్‌లో అంగన్‌వాడీ కేంద్రం ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న వేరుశనగ చిక్కీల్లో పురుగులు ఉన్నాయంటూ వచ్చిన ఫిర్యాదుపై స్పందించారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్ ఉషారాణి, కార్యకర్త విజయరాణిలతో మాట్లాడారు. కాలనీలో చిక్కీలు పొందిన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లారు. చిక్కీల్లో పురుగులు ఉన్నా యా అంటూ ప్రశించారు. అయితే లబ్ధిదారులు చిక్కీలు నాణ్యంగా ఉన్నాయని తెలిపారు. దీనిపై ఐసీడీఎస్ అధికారులకు నివేదిక పంపనున్నట్లు ఆమె తెలిపారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

నరసరావుపేట ఈస్ట్: బొల్లు రాజేశ్వరి కృష్ణారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం బొప్పూడి గ్రామానికి చెందిన ఐనాల వనితలక్ష్మికి రూ.25 వేలు ఆర్థిక సహాయం అందించారు. వనితలక్ష్మి కాకినాడలోని రంగరాయ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతోంది. చదువుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకి కాకుదనే ఉద్దేశ్యంతో విద్యార్థినికి ఆర్థిక సహాయం అందచేసినట్లు ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ వైస్‌చైర్మన్ బొల్లు వెంకటేశ్వర్లు, సభ్యులు కోమటినేని నాసరయ్య, బీవీఏఎల్ వరప్రసాద్, మర్లపాటి రామకృష్ణ, జాస్తి. గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.